క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న జ్యోతి

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి జిల్లాకు చెందిన నడిమిపల్లి జ్యోతి రూ.1,01,116 విరాళంగా మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రాచార్యులు, పీఆర్ ఇంజనీర్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసీహెచ్ మహంతి, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

యోగ సాధన అలవరుచుకోవాలి



శిబిరంలో పాల్గొన్న చిన్నారులు

ఎచ్చెర్ల: సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతిఒక్కరూ యోగా చేయడం అలవరుచుకోవాలని లావేరు శాఖా గ్రంథాలయం అధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. వేషవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం యోగా, తైలవర్ణ చిత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా 100 మంది విద్యార్థులతో యోగా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు కోరాడ వాసుదేవరావు, పప్పు మల్లేశ్వరరావు, టి.వీరభద్రుడు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు



మాట్లాడుతున్న సర్పంచ్ పైడి భాస్కరరావు

ఎచ్చెర్ల : కేశవరావుపేటలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం వికసిత కృషి సంకల్పిత అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాగోలు వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ మేలైన రకాలను సాగుచేసుకోవాలని రైతులకు సూచించారు. శాస్త్రవేత్త డాక్టర్ హేమ మాట్లాడుతూ కూరగాయల సాగు, స్టోరేజీ విధానాలను వివరించారు. కేవీకే శాస్త్రవేత్త సునీత మాట్లాడుతూ ఉద్యాన పంటలు, నారు పెంపకం, కోళ్ల పెంపకం, పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ పైడి భాస్కరరావు మాట్లాడుతూ వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే శాస్త్రవేత్తల సలహాలు సూచనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్, మాజీ సర్పంచ్ భీమారావు, ఎంపీటీసీ జగదీష్, శ్రీనివాస్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గరుడ వాహనం సమర్పణ



గరుడ వాహనం సమర్పిస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని డీసీసీబీ కాలనీలో భూ వేంకటేశ్వర స్వామి దేవాలయం 4వ వార్షికోత్సవం సందర్భంగా నూతన గరుడ వాహనాన్ని భక్తులు సమర్పించారు. అర్చకులు గోపాలాచార్యులు మాట్లాడుతూ గొంటు శ్రీనివాసబాబు, రేణుక దంపతులు ఈ వాహనాన్ని సమర్పించినట్లు తెలిపారు.

ఆపదలో చిన్నారి



చికిత్స పొందుతున్న చిన్నారి

శ్రీకాకుళం కల్చరల్: టెక్కలికి చెందిన శ్రీకాంత్, శృతి దంపతుల చిన్న కుమార్తె (ప్రస్తుతం 6 నెలల వయసు) ప్రాణాంతక కాలేయ వ్యాధి పిత్తాశయ అట్రేసియాతో బాధపడుతోందని, దాతలు ముందుకు వచ్చి సాయం అందించాలని ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ప్రతినిధి నంది ఉమాశంకర్ కోరారు. ఆపరేషన్‌కు సుమారు రూ.25లక్షల వ్యయం అవుతుందని వైద్యులు తెలియజేశారని, ఆర్థిక పరిస్థితి సహకరించనందున దాతలు సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. సాయం చేయాలనుకునే వారు 7008014792 నంబరును సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఏడాది పాలన.. సూపర్ ఫ్లాప్

- నెరవేరని కూటమి ప్రభుత్వ హామీలు
- కార్యాచరణకు నోచుకోని సూపర్ సిక్స్ పథకాలు
- పాలకుల తీరుపై ప్రజల మండిపాటు



ఎచ్చెర్ల/గార/జి.సిగడాం/శ్రీకాకుళం రూరల్:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి చంద్రబాబునాయుడు కోకొల్లలుగా హామీలు గుప్పించారు. గద్దెనెక్కిన వెంటనే సూపర్ సిక్స్ వంటి హామీలు అమలు చేస్తామని ప్రకటించారు. అయితే అధికారంలోకి వచ్చి నేటికి ఏడాది పూర్తవుతున్నా ఇప్పటికీ హామీలను నెరవేర్చలేని పరిస్థితి. కనీసం సూపర్‌సిక్స్ పథకాలైనా అమలు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉచిత గ్యాస్ పథకం ఆర్భాటంగా ప్రారంభించినా ఇప్పటికీ చాలా మంది అకౌంట్లకు డబ్బులు జమ కావడం లేదు. మహిళలకు బస్సు ఫ్రీ అంటూ ఎప్పటికప్పుడు ప్రకటనలు గుప్పిస్తున్నా అమలు ఊసే లేదు. తల్లికి వందనం పథకం ఏడాదిగా అమలుకు నోచుకోవడం లేదు. రైతులు పెట్టుబడులు పెట్టే సమయం వచ్చినా ఇంతవరకూ అన్నదాత సుఖీభవకు దిక్కే లేకుండాపోయింది.

ఎక్కడి హామీలు అక్కడే..

స్థానికంగా ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చడం లేదు. లావేరు మండలం బుడుమూరు పెద్ద చెరువు వద్ద మినీ రిజర్వాయిర్ నిర్మిస్తామని చెప్పిన కూటమి నేతలు గద్దెనెక్కాక ఆ సంగతే మర్చిపోయారు. ఎచ్చెర్ల మండలంలోని తోటపాలేం ఎత్తిపోతల పథకం, నారాయణపురం కుడికాలువ ఆధునికీకరణ పనులను చేపడతామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులు కూడా నత్తనడకన నడుస్తున్నాయి.

గత ప్రభుత్వంలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నవరత్నాలు పేరిట ప్రజలకు ఠంఛన్‌గా సంక్షేమ పథకాలు అందేవి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పార్టీలకతీతంగా పథకాలు అమలుచేయడంతో పాటు నేరుగా వారి ఖాతాల్లోకే నగదు జమ చేశారు. రెండేళ్లు కరోనా వ్యాప్తి చెందడంతో ఆర్థిక ఇబ్బందులున్నా పథకాలు అమలు ఏమాత్రం ఆపలేదు. ఏడాది క్రితం జరిగిన ఎన్నికల కోసం ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబు ఒక్క పథకం కూడా అమలు చేయడం లేదు. ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి ఒక్క హామీ కూడా నెరవేర్చని కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు మండిపడుతున్నారు.

కాలయాపన తగదు..



ఏడాది పూర్తవుతున్నా సంక్షేమ పథకాలు అమలు చేయకుండా అబద్ధపు మాటలతో కాలయాపన చేస్తున్నారు. ఎంతమంది పిల్లలున్నా వారందరికీ తల్లికి వందనం పథకం కింద రూ.15వేలు ఇస్తామని చెప్పి అమలు చేయలేదు. సూపర్ సిక్స్ పేరిట ఉన్న పథకాలన్నీ నిలిపేశారు.

– టి.అప్పలరాజు, కళింగపట్నం, గార మండలం

ఉచిత బస్సు తుస్..



మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటు చేస్తామని ఏడాది గా చెబుతున్నారు తప్ప అమలు చేయడం లేదు. అనేక రకాల సంక్షేమ పథ కాలు వర్తింపజేస్తామని ప్రకటనలు చేస్తున్నారు గానీ కార్యరూపం దాల్చడం లేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి.

– కుమరాపు శాంతి, డీఆర్‌వలస, జి.సిగడాం

మోసపూరిత హామీలు..



వైఎస్సార్‌సీపీ ఉన్నప్పుడు మూడుసార్లు ఆసరా వచ్చింది. మాలాంటి వారికి ఆ డబ్బు ఎంతో ఉపయోడపడుతుంది. టీడీపీ నెలకు రూ.1500 ఇస్తానని చెప్పి అసలు కసరత్తు కూడా చేయడం లేదు. ఇవన్నీ మోసపూరిత హామీలు.

– ఆర్.రేణుక, శ్రీకాకుళం

కష్టంగా ఉంది..



తల్లికి వందనం పేరిట ఎంత మంది పిల్లలు బడి, కాలేజీకి వెళ్తున్నా అంతమందికీ రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంత వరకూ ఈ హామీను నెరవేర్చలేదు. తల్లికి వందనం డబ్బులు వేయకపోవడంతో పిల్లలను చదివించడం చాలా కష్టంగా ఉంది. అప్పులు వాడి ఫీజులు కట్టాల్సి వస్తోంది.

– గొర్లె దమయంతి, గృహిణి, మురపాక

సాయమేదీ?



గత ప్రభుత్వంలో వాహన మిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేలు చొప్పున సాయం అందించారు. ఐదేళ్లలో రూ. 50 వేలు అందుకున్నాను. ఈ డబ్బులు ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, మరమ్మతులకు ఉపయోగపడేవి. ప్రస్తుత ప్రభుత్వంలో మాకు ఎలాంటి సాయం అందలేదు. ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చినా నెరవేరలేదు.

– రెడ్డి గోపాల్, ఆటో డ్రైవర్, చిన్నయ్యపేట

మోసపోయారు



ఎన్నికల ముందు అర్హులైన మహిళలకు, సంఘాల సభ్యులకు వడ్డీ డబ్బులు చెల్లిస్తామన్నారు. మహిళలకు ప్రతి నెలా రూ.1500 చొప్పున అందిస్తామన్నారు. ఏడాది పూర్తయినా ఇంతవరకు ఎటువంటి పథకం అమలు చేయలేదు. చంద్రబాబునాయుడు బూటకపు హామీలతో జనం మోసపోయారు.

– వాన ప్రమీల, ఎంఎంఎస్ మాజీ అధ్యక్షురాలు, ఎందువ

అన్నదాత సుఖీభవ ఏదీ?



వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. పెట్టుబడులు పెట్టాల్సిన సమయం వచ్చింది. అయినా కూటమి ప్రభుత్వం ఆన్‌లైన్, ఈకేవైసీ అంటూ కాలయాపన చేస్తోంది తప్ప అన్నదాత సుఖీభవం డబ్బులు వేయడం లేదు. దీంతో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది.

– పిన్నింటి రాముడు, రైతు, మురపాక

జగన్‌పై అక్కసుతోనే రేషన్ వాహనాల తొలగింపు



సమావేశంలో మాట్లాడుతున్న పిన్నింటి సాయికుమార్

రణస్థలం: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మార్కు కనిపించకుండా ఉండేందుకు ప్రజలకు ఉపయోగపడే రేషన్ వాహనాలను కుటమి ప్రభుత్వం రద్దు చేసిందని వైఎస్సార్ సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకుడు పిన్నింటి సాయికుమార్ అన్నారు. రణస్థలం మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రేషన్ షాపుల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై కక్షసాధింపే లక్ష్యంగా రెడ్‌బుక్ రాజ్యాంగం పాలన కొనసాగించడం సిగ్గు చేటన్నారు. హామీలు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రణస్థలం జెడ్పీటీసీ టొంపల సీతారాం, నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, మహంతి చినరామినాయుడు, కంబపు రామిరెడ్డి, పిన్నింటి లక్ష్మంనాయుడు, మింది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' విజయవంతం చేద్దాం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పాలన పూర్తయినా ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేసి మోసగించడం సరికాదని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎంఏ బేగ్, జోనల్ ఇన్‌చార్జి ఎంఏ రఫీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శ్రీకాకుళం ఏడు రోడ్ల జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు.

బూటకపు హామీలపై నిలదీద్దాం



గేదెల పురుషోత్తం

శ్రీకాకుళం రూరల్: వెన్నుపోటు దినం పేరిట బుధవారం నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదేల పురుషోత్తం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశాలు మేరకు ఉదయం 10 గంటలకు ఏడురోడ్ల జంక్షన్ వైఎస్సార్ సర్కిల్ నుంచి పాలకొండ రోడ్డు మీదుగా తహశీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులంతా పాల్గోవాలని పిలుపునిచ్చారు.

తరలిరండి..

గార: వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పీస గోపి పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని ఏడు రోడ్ల జంక్షన్ వద్ద నుంచి ఉదయం 9 గంటల నుంచి బయలుదేరి, శాంతియుతంగా పాదయాత్ర చేస్తూ శ్రీకాకుళం మండల తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తామని, అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జయప్రదం చేయాలి..



సమావేశంలో మాట్లాడుతున్న దోల వెంకటరమణ

జి.సిగడాం: రణస్థలంలో బుధవారం జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలని జి.సిగడాం మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, జిల్లా అధికార ప్రతినిధి పిల్లల శివకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం సంతవురిటిలో వారు విలేకరులతో మాట్లాడుతూ జి.సిగడాం మండలం నుంచి రెండు వేల మంది హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గేదెల నారాయణరావు, బాలబొమ్మ శ్రీనివాసరావు, లక్ష్మణరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పేరిట మోసం



రౌతు శంకరరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సూపర్ సిక్స్‌తో చంద్రబాబు చేతిలో రాష్ట్ర ప్రజలంతా మోసపోయారని వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రౌతు శంకరరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిపై బుధవారం నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వార్షిక కల్యాణోత్సవాలకు వేళాయె..

- నిత్య పూజలతో అలరారుతున్న వేంకటేశ్వరస్వామి
- రేపటి నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు



అలంకరణలో వేంకటేశ్వరస్వామి



ఆలయ ద్వారం

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని చిన్నబజారులో అతి పురాతన ఆలయంగా పేరుపొందిన అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వార్షిక కల్యాణోత్సవాలకు సిద్ధమైంది. భక్తుల సహకారంతో నిర్మాణం జరిగిన ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా వెలసింది. 1800 సంవత్సరంలో దూది పరాంకుశం సోదరులు చిన్నపాటి గుడిలో స్వామివారిని ప్రతిష్ఠించారు. 1976లో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధీనంలోకి వచ్చింది. 1990లో ఆలయ ముఖమండపం నిర్మాణం చేశారు. 2012లో ఆలయ పునఃప్రతిష్ఠ జరిగింది. ఆ సమయంలోనే కొత్త ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు దేవదాయశాఖ ఆధ్వర్యంలో గీతా సత్సంగం నేతృత్వంలో వార్షిక కల్యాణాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 5న ఉదయం స్వామివారి నిత్యార్చనలు, విశ్వక్సేన పూజ, రుత్విక్ వరుణ, అగ్ని ప్రతిష్ఠ, 6న అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం అనంతరం మహానివేదన, 7న చతుస్థాన అర్చనలు, నిత్య హోమాలు, మహాపూర్ణాహుతి, పుష్పయాగం, పిండివంటల నివేదన తదితర కార్యక్రమాలు జరగనున్నాయి.

పురాతన ఆలయం



గీతా సత్సంగం భక్తుల సహకారంతో ఆలయాన్ని పునరుద్ధరణ జరిగాక నిత్య కైంకర్యాలతో పూజలు జరుగుతున్నాయి. స్వామిని దర్శించుకునే భక్తులకు అన్ని శుభాలు కలుగుతాయి.

– మాధవి, ఆలయ ఈఓ

మహిమ గల స్వామి..



కోరిన కోర్కెలు తీర్చే మహిమగల స్వామిగా ఈ ప్రాంత వాసులను స్వామివారు అలరిస్తున్నారు. స్వామి దర్శించేందుకు నిత్యం భక్తులు వస్తుంటారు. ఈ ఆలయంలో ఉన్న స్వామి విగ్రహం ఎంతో పురాతనమైనది.

– రేజేటి వేంకట శ్రీనివాసాచార్యులు, ప్రధానార్చకులు

రాష్ట్రపోటీలకు జిల్లా బాస్కెట్ బాల్ జట్లు పయనం



క్రీడాకారులతో ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: చిత్తూరు వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా క్రీడాకారుల బృందం మంగళవారం ఇక్కడి నుంచి పయనమైంది. జట్టుకు ముగ్గురేసి చొప్పున ఆడే ఈ టోర్నమెంట్‌లో బాలురు జట్టుకు అభిలాష్, నితిన్, సురేంద్ర, దేవా.. బాలికల జట్టుకు అక్షయ, తనుషా, వర్షిని, కావ్యశ్రీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిని జిల్లా బాస్కెట్‌బాల్ సంఘ ఛైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి అభినందించి వీడ్కోలు పలికారు. పోటీలకు వెళ్లేందుకు అవసరమైన ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో అర్జున్‌రెడ్డి, జె.శంకర్, కొర్లయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవర ఊరేగింపు



నూకాలమ్మ దేవర ఊరేగింపు



పెద్దమ్మతల్లి దేవర ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో సిరిమాను ఉత్సవంలో భాగంగా నూకాలమ్మతల్లి, పెద్దమ్మతల్లి అమ్మవార్ల దేవరల ఊరేగింపు సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు భక్తిశ్రద్ధలతో కొనసాగింది. గ్రామ పొలిమేరలోని జిల్లా పరిషత్ నుంచి కునుకుపేట వరకు సిరిమాను కమిటీ సభ్యులు, భక్తుల సందడి నడుమ మేళతాళాలతో ఊరేగించారు. మంగళ వాయిద్యాలు, తప్పెటగుళ్ల, చెక్కభజనలు, నృత్యాలు అలరించాయి. పెద్దమ్మతల్లి దేవరను సంతోషిమాత గుడి వద్దగల చదురుకు, నూకాలమ్మ దేవరను నక్కవీధిలో ఉన్న అమ్మవారి చదురుకు చేర్చారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

గార: శ్రీకూర్మం గ్రామదేవత మోహినీ భద్రాంబికా ఉత్సవాలు సందర్భంగా స్థానిక యువత ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకూర్మం పుణ్యక్షేత్రమని, ఆలయ పూర్వవైభవానికి కృషి చేస్తామన్నారు. యోగాంధ్రను శ్రీకూర్మంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

డీఆర్పీలకు శిక్షణ

శ్రీకాకుళం న్యూకాలనీ: కొత్త విద్యా సంవత్సరంలో టీచర్ల విధులపై డీఆర్పీలకు శిక్షణ తరగతులు మొదలయ్యాయి. శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా ప్రతి సబ్జెక్టు నుంచి 24 మంది డీఆర్పీలను ఎంపికచేసి వారికి స్టేట్ రిసోర్స్ పర్సన్లతో తరగతులు చెప్పిస్తున్నారు. డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య ఈ శిక్షణ తరగతులను ప్రారంభించారు. టీచర్లంతా అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఒకవైపు విద్యాశాఖలో పదోన్నతులు, మరోవైపు బదిలీలు జరుగుతుండగా.. మళ్లీ శిక్షణ తరగతులు నిర్వహించడాన్ని టీచర్లు తప్పు పడుతున్నారు.

ఉత్సాహంగా నాట్య పోటీలు



నాట్య పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులకు చదువుతోపాటు ఆటవిడుపు కూడా ఎంతో అవసరమని విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రభాకరరావు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం సోడవరపు ఈశ్వరరావు ఆధ్వర్యంలో చిన్నారులకు నాట్యపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వీవీజీఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి.భాస్కరరాజా, సిబ్బంది వరలక్ష్మి, ప్రత్యూష, గణేష్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



ధ్రువపత్రాలతో విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని శాంతినగర్ కాలనీలో సత్యసాయి నృత్య కళానికేతన్‌లో నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం మంగళవారంతో ముగిసింది. నృత దర్శకులు ఎస్.పి.కవిత ఆధ్వర్యంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి హారికా ప్రసాద్ హాజరై నిర్వాహకులను అభినందించారు. 30 మంది చిన్నారులు నెలరోజుల పాటు భరతనాట్యంలో శిక్షణ పొందారు. వీరికి హారికా ప్రసాద్ చేతుల మీదుగా ధ్రువపత్రాలు అందజేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

శ్రీకాకుళం అర్బన్: బలగ హడ్కో కాలనీలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మంగళవారం గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను ఆధ్వర్యంలో చిన్నారులకు స్వర్ణాంధ్ర–2047పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. బాల కథానిలయం అధ్యక్షులు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు బోగెల ఉమామహేశ్వరరావు, గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

ఎచ్చెర్ల: వ్యవసాయంలో రసాయనిక ఎరువులు మితిమీరి వాడటం వల్ల పెట్టుబడులు పెరుగుతాయని, భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడాలని ఎర్రంనాయుడు వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.మోష అన్నారు. ధర్మవరంలో వ్యవసాయ కళాశాల విస్తరణా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మోష మాట్లాడుతూ రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువుల వాడటం వల్ల భూమి సారవంతమవుతుందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో మట్టి శాస్త్ర విభాగం అసోసియేట్ డాక్టర్ కేవీఎస్ఎల్ రాజ్‌రుషి, విస్తరణా విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యామినీలీల, వ్యవసాయ సహాయకులు లీల, రైతులు పాల్గొన్నారు.